క్లుప్తంగా

రక్తదానం అభినందనీయం



పోతయ్యను అభినందిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: జెమ్స్ వైద్య కళాశాలలో చికిత్స పొందుతున్న నిండు గర్భిణి పి.కన్యాకుమారి(30)కి అత్యవసరంగా ఎ.నెగెటివ్ రక్తం అవసరం కావడంతో ధర్మవరం గ్రామానికి చెందిన కార్పెంటర్ పోతయ్య రక్తదానం చేసి ఆదర్శంగా నిలించారు. ఈ సందర్భంగా దాతను చైర్మన్ జగన్మోహనరావు అభినందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు నంది ఉమాశంకర్, బి.సతీష్, సామాజిక సేవకులు ఉర్లాం శివతేజ, ఉమాశంకర్, జి.మహాలక్ష్మీ, చరణ్, సుజాత, ఆయేషాబేగం, జగదీష్ పాల్గొన్నారు.

రుణాలు చెల్లించే సంఘాలకు చేయూత

జి.సిగడాం: అర్హులైన మహిళా సంఘాలకు బ్యాంకు ద్వారా ప్రత్యేక రుణాలను మంజూరు చేసేందుకు కృషి చేస్తున్నామని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వాన ప్రమీల రాణి అన్నారు. ఎందువ గ్రామంలో మహిళా సంఘ సభ్యులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తీసుకున్న రుణాన్ని సకాలంలో చెల్లించే స్వయం శక్తి సంఘాల సభ్యులకు ప్రత్యేక రుణాలు అందించేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. ఇప్పటికే స్త్రీనిధి ద్వారా అర్హులైన సంఘ సభ్యులకు రుణాలను మంజూరు చేశామన్నారు.

నేడు మండల సమావేశం

జి.సిగడాం: మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం ఉదయం పది గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వెంకన్నబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన జరగనున్న సమావేశానికి సభ్యులు, అన్ని విభాగాల అధికారులు హాజరు కావాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

జి.సిగడాం: విద్యుత్ లైన్ల మరమ్మతులు చేపడుతున్నందున మండలంలోని పలు గ్రామాలకు శనివారం ఉదయం పది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సరఫరాను నిలిపి వేస్తున్నట్టు ఏఈఈ జి.తిరుపతిరావు గురువారం తెలిపారు. ఆనందపురం, దవళపేట, పాలఖండ్యాం, సంతవురిటి, మెట్టవలసతోపాటు మరో ఐదు గ్రామాలకు సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సాయిబాబాకు పూజలు



ఆనందపురంలో పూజలందుకున్న స్వామివారు

జి.సిగడాం: మండల పరిధిలోని గెడ్డకంచరాం, జాడ, దేవరవలస, ఎందువ, పెంట, జి.సిగడాం, ఆనందపురం గ్రామాల్లోని సత్యసాయి బాబా ఆలయాల్లో గురువారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆనందపురంలోని వంద అడుగుల వెంకటి సాయి కోటి మహాస్థూపం, 46 అడుగుల నాగసాయికి భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం భక్తులు అన్నదానం చేశారు.

గురు దత్తాత్రేయునికి అభిషేకాలు



పూజలందుకుంటున్న దత్తాత్రేయుడు

శ్రీకాకుళం కల్చరల్: బలగ నాగావళి తీరాన ఉన్న బాలత్రిపుర కాలభైరవ స్వామి దేవాలయంలో గురు దత్తాత్రేయ స్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష గురూజీ ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు, అర్చనలు చేసి అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు.

ఉత్తమ విద్యార్థులకు ఉచిత విద్య

రణస్థలం: ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి 5, 6, 7 తరగతుల్లో ఉచితంగా చేరే విద్యార్థులకు వచ్చేనెల రెండో తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని ఐరిస్ సకల్య స్కూల్ డైరెక్టర్ కె.హరిక్రిష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చి మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు పదో తరగతి వరకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫాం, విద్యను అందిస్తామని చెప్పారు. మరో ఐదుగురుకి రూ. 5 వేలు స్కాలర్ ఇస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం కొండ ములగాం సమీపంలోని ఐరిస్ పాఠశాలను సందర్శించాలన్నారు.

అన్నమయ్యకు స్వర నీరాజనం

- ఘనంగా అన్నమాచార్య జయంతి ఉత్సవం
- కీర్తనలు ఆలపిస్తూ శోభాయాత్ర



శ్రీకాకుళం నగరవీధుల్లో అన్నమయ్య చిత్రపటంతో శోభాయాత్ర

శ్రీకాకుళం కల్చరల్: ప్రముఖ వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్య 616వ జయంత్యుత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. పాతశ్రీకాకుళంలోని కలెక్టర్ బంగ్లా ఎదురుగా ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయం నుంచి అన్నమయ్య కీర్తనలు ఆలపిస్తూ వీధుల్లో శోభాయాత్ర కొనసాగించారు. అనంతరం అర్చకులు వంశీకృష్ణ ఆధ్వర్యంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అష్టోత్తర శతనామాలతో అర్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షులు ఎం.యోగేశ్వరరావు, కార్యదర్శి బెహరా నాగేశ్వరరావు, డి.నాగేశ్వరరావు, ఎం.కాశీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

- కత్తెరవీధిలోని రాజరాజేశ్వరీ దేవిపీఠం, శ్రీవారికి స్వరార్చన వాట్సాప్ గ్రూప్ సంయుక్త నిర్వహణలో తాళ్లపాక అన్నమాచార్య జయంతి ఉత్సవం వేడుకగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ ఉత్సవంలో పలువు గాయకులు అన్నమయ్య కీర్తనలను ఆలపించారు. ప్రీతి, మహతిల గాత్ర కచేరి ఆకట్టుకుంది. కార్యక్రమంలో సింహాద్రి శ్రీనివాసరావు, సుసరావు లక్ష్మీగణపతి శర్మ తదితరులు పాల్గొన్నారు.
- డీసీసీబీ కాలనీలో భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అన్నమాచార్య జయంతిని పురస్కరించుకొని సంకీర్తనాగానం చక్కగా సాగింది. శ్రీవాణి సంగీత కళాక్షేత్రం నిర్వాహకులు దుంపల ఈశ్వరరావు ఆధ్వర్యంలో చిన్నారులు, మహిళలు వీనుల విందుగా గానం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు బిర్లంగి రామ్మోహన్‌రావు, దుంపల సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.
- **శ్రీకాకుళం అర్బన్:** జిల్లా కేంద్ర గ్రంథాలయంలో తాళ్లపాక అన్నమాచార్య జయంతి ఉత్సవం శ్రీ తరణి కృష్ణ స్మారక ధార్మిక సేవా ట్రస్ట్ వాడాడ, శృతిలయ సంగీత శిక్షణాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ట్రస్ట్ చైర్మన్ మండా శ్రీనివాసరావు, ట్రస్టీలు వెంకట రమణ మూర్తి, గణేశ్వరరావు, రెడ్డి సత్యనారాయణ, దొర తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ సంగీత సంస్థల కళాకారులు, స్థానిక కళాకారులు అన్నమాచార్య కీర్తనలు గానం చేసి ప్రేక్షకులను అలరించారు. హార్మోనియంపై రెడ్డి సత్యనారాయణ, వయొలిన్‌పై ధనుంజయ రెడ్డి, మృదంగంపై శ్రీనివాసరావు, వినోద్, సాయి చరణ్‌లు సహకరించారు. మొదట ఉత్సవం టి.కొండలరావు శాక్సఫోన్ వాయిద్యంతో నాద నీరాజనం కార్యక్రమం జరిగింది. జి.పవన్ కుమార్, వెంకటేశ్వరి, శ్రీ చరణ్ తదితరులు పాల్గొన్నారు.



కేంద్ర గ్రంథాలయంలో శాక్సాఫోన్ కచేరీ



రాజరాజేశ్వరీ పీఠంలో స్వరార్చన



డీసీసీబీ కాలనీలో అన్నమయ్య గళార్చన చేస్తున్న చిన్నారులు

భారీ మెజార్టీతో విజయం సాధిస్తా

- ఎచ్చెర్ల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

జి.సిగడాం: ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ఎచ్చెర్ల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గొర్లె కిరణ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రం జి.సిగడాంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 13వ తేదీన జరిగిన ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయడంతో భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిసి మరోసారి ఎచ్చెర్ల గడ్డపై వైఎస్సార్‌సీపీ జెండాను రెపరెపలాడిస్తామన్నారు. గత ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం హయాంలో ప్రతిఒక్కరు ఆనందంగా జీవించారన్నారు. దీంతో రాష్ట్రంలో మరోసారి జగనన్న రాజ్యం ఏర్పాటు కావడం తథ్యమన్నారు. మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటమరణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు పేడాడ శ్రీరామమూర్తి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగిని కుటుంబానికి పరామర్శ



సుశీల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు

గార: కళింగపట్నం సచివాలయ ఉద్యోగిని పప్పు సుశీల ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ యువనాయకుడు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు గురువారం పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ఓదార్చారు. అదే గ్రామానికి చెందిన పుక్కళ్ల సావిత్రి, మైలపల్లి రమేష్, వారాధి రూపవతి కుటుంబ సభ్యులను కూడా పరామర్శించారు. కార్యక్రమంలో బి.ఎర్రన్న, మైలపల్లి వాసుదేవరావు, పప్పు పోలీసు, పప్పు బాబూరావు, గుంటు రామచంద్రారావు, బత్తుల గోవింద పాల్గొన్నారు.

వంశధార గట్టుపై తవ్వకాలు



వంశధార గట్టు వద్ద ఏర్పడిన గొయ్యి

గార: మండల కేంద్రం గారలో అర్ధరాత్రి సమయంలో వంశధార గట్టు నుంచి మట్టితో కూడిన ఇసుకను జేసీబీ వాహనం ద్వారా తరలిస్తున్నారు. దీంతో వరదల సమయంలో ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంటుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గార గ్రామంలోని శివాలయానికి కూతవేటు దూరంలో స్నానాల రేవు ఉంది. వేసవిలో కూడా స్థానికులు స్నానాలకు ఈ రేవునే ఉపయోగిస్తుంటారు. బుధవారం రాత్రి వ్యక్తిగత అవసరాల కోసం వంశధార నది గట్టును జేసీబీ వాహనం ద్వారా కొందరు తవ్వేశారు. స్థానికులు ఫిర్యాదుతో పోలీసులు రంగ ప్రవేశం చేసేసరికి తరలింపు ఆపేశారు. వంశధార నది ఉధృతంగా ప్రవహిస్తుందని, గట్టును వ్యక్తిగత అవసరాలకు తవ్వేస్తే వరద నీరు గ్రామంలోకి వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత వంశధార ప్రాజెక్టు అధికారులు, అధికారులు దృష్టి సారించి ఇలాంటి చర్యలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పట్టుదలతో చదివితే ఉజ్వల భవిష్యత్



మ్యాగజైన్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని నైరా వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ఎం.భరతలక్ష్మి అన్నారు. గురువారం నైరా వ్యవసాయ కళాశాల 35వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయ సాధనకు పిల్లలు కృషి చేయాలన్నారు. అనంతరం కళాశాలకు సంబంధించిన సూర్య మ్యాగ్‌జైన్‌ను ప్రత్యేకాధికారి ఏఎస్ నాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు చిన్నంనాయుడు, సూర్య, సూర్యనారాయణ, భరత్ తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్లలో నగర సంకీర్తన



ప్రత్యేక అలంకరణలో స్వామివారు



గ్రామంలో నగర సంకీర్తన

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామంలో నగర సంకీర్తన చేశారు. అన్నమాచార్య కీర్తనలు, భజన, వాయిద్యాలతో సంకీర్తన కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

26న రక్తదాన శిబిరం

రణస్థలం: మండల కేంద్రంలోని ఇడదాసుల విద్యా ఆరోగ్య సేవా ఫౌండేషన్ అధ్వర్యంలో ఈ నెల 26న రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నామని సేవా ఫౌండేషన్ అధ్యక్షులు ఇడదాసుల తిరుపతిరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం తొమ్మిది గంటలకు సేవా ఫౌండేషన్ కార్యాలయ ఆవరణలో నిర్వహించే శిబిరాన్ని ఔత్సాహికులు వచ్చి రక్తదానం చేయాలని కోరారు. ఆసక్తి ఉన్నవారు 98480 04156 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేడు రంగనాథస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేటలోని రంగనాథస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయంలో ఏర్పాట్లు చేశారు. త్రిదండి అ హోబిల రామానుజ జీయర్ స్వామి ఈ ప్రత్యేక పూజలకు హాజరు కానున్నారు. అష్టోత్తర శత కలశాభిషేక మహోత్సవ పూజలు ఉంటాయని ఆలయ ప్రతినిధులు తెలిపారు.

వేడుకగా రాధాగోవిందుల నౌకావిహార యాత్ర



నౌకా విహార యాత్ర సేవలో భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: పొన్నాడ బ్రిడ్జి వద్ద నాగావళి నదీ తీరం, హరేకృష్ణా హిల్స్‌లోని ఇస్కాన్ జగన్నాథ్, భలదేవ్, సుభద్రమాయ్ మందిరంలో గురువారం సాయంత్రం రాధా గోవిందుల నౌకావిహార యాత్ర సేవ ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారు విహరించిన నౌకను లాగి ఆయన ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో మందిర నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శ్రీకాకుళం రూరల్: మండలంలోని అలికాం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అలికాం, అలికాం కాలనీ, నైరా బట్టేరు, పొన్నాడ, నవనంబాడు, గొల్లపేట, బమ్మిడివానిపేట, చల్లపేట, వెంకటాపురం, కరజాడ, రోణంకి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. కనుగులవానిపేట సబ్‌స్టేషన్ పరిధిలో కల్లేపల్లి, మోపసుబందరు, జాలారిపేట, సాదుపేట, పెద్దగనగళ్లవానిపేట, చినగళగల్లవానిపేట, నర్సయ్యపేట, ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శన చేస్తున్న మెహర్‌ప్రభాకర్ బృందం

శ్రీకాకుళం కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం, గోవిందరాజ స్వామి అఖండ బ్రహ్మోత్సవాలలో నగరానికి చెందిన నాట్య గురువు డి.మెహర్ ప్రభాకర్ బృందం భరతనాట్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. హనుమంతా దేవనమో అనే నృత్యాంశంతో ముత్యాలపందిరి, కల్పవృక్ష వాహన సేవలో భాగంగా మాడవీధులలో నృత్య ప్రదర్శన చేసి నీరాజనం సమర్పించామని నిర్వాహకులు తెలిపారు.

ఆధ్యాత్మికం

ఘనంగా శివపార్వతుల కల్యాణం



శివపార్వతుల కల్యాణం

శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని సంతోషి మాత ఆలయం వద్ద కామేశ్వరీ తల్లి అమ్మవారి పండుగల సందర్భంగా గురువారం శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. అర్చకులు దర్భముళ్ల ప్రభాకరశర్మ ఆధ్వర్యంలో సంప్రదాయంగా కల్యాణం జరిపించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష ఆరాధనలు చేశారు.

జొన్నలపాడులో..

గార: రామచంద్రాపురం పంచాయతీ జొన్నలపాడులో ఉమా సహిత కాశీవిశ్వేశ్వర ఆలయంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా గురువారం శివ పార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. గ్రామపురోహితులు మావుదూరి మోహనశర్మ ఆధ్వర్యంలో రుత్విక్కులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం 3 వేల మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మతల్లికి నాదస్వర అర్చన



నాదస్వర కచేరి ప్రదర్శన



ఘటాలతో ఊరేగింపు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని కాకివీధిలో జరుగుతున్న ముత్యాలమ్మతల్లి పండగల సందర్భంగా గురువారం నాదస్వర అర్చన ఘనంగా జరిగింది. 16మంది డోలు, సన్నాయి వాద్యకారులు భక్తి గీతాలాపనలు, కీర్తనలు ఆలపించారు. అనంతరం ముత్యాలమ్మతల్లి ఘటాలతో ఊరేగింపు నిర్వహించారు. ఇంటి వద్దకు వచ్చిన ఘటాలకు భక్తులు పూజలు చేశారు.

వైభవంగా పూర్ణాహుతి



పూర్ణాహుతి సామగ్రితో అర్చక బృందం

గార: శ్రీకూర్మనాధుని కల్యాణోత్సవంలో భాగంగా వైశాఖ పూర్ణిమ పురస్కరించుకొని గురువారం సాయంత్రం పూర్ణాహుతి శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామ నృసింహాచార్యులు ఆధ్వర్యంలో క్రతువు పూర్తి చేశారు. ఉదయం శ్వేతపుష్కరిణిలో ఉత్సవమూర్తులకు అవభృద స్నానం నిర్వహించారు. అనంతరం భక్తులు పవిత్ర స్నానాలచరించారు. కల్యాణోత్సవం చివరి కార్యక్రమంగా పూర్ణాహుతి జరిపించారు. ఆలయ ఈవో జి.గురునాథం, దాసుబాబు, శ్రీభాష్యం పద్మనాభాచార్యులు, శ్రీనివాసాచార్యులు, కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ పౌర్ణమి వేడుకలు



బుద్ధ పౌర్ణమి వేడుకల్లో భక్తులు

శ్రీకాకుళం/శ్రీకాకుళం(పీఎన్ కాలనీ): అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో గురువారం వైశాఖ పౌర్ణమి సందర్భంగా 2568వ బుద్ధ జయంతిని బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు బోయిడి మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రజ్ఞ శీల, కరుణ అష్టాంగ మార్గాలను ప్రభోదించే మహాత్ముడు బుద్ధుడని పేర్కొన్నారు. బౌద్ధమంటే సంస్కారవంతమైన సంఘ జీవన విధానమన్నారు. మనుషులందరూ సమానమేనని బోధించిన తొలి సంఘ సంస్కర్త బుద్ధుడన్నారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు, డాక్టర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పౌర్ణమి పూజలు



సంతోషిమాతకు అభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్: వైశాఖ శుద్ధ పౌర్ణమి సందర్భంగా పాతశ్రీకాకుళంలోని సంతోషిమాత అమ్మవారి ఆలయంలో అర్చకులు మోదుకూరి కిరణ్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, అష్టోత్తర శతనామాలతో అర్చనలు, లలితా సహస్రనామ పారాయణలు జరిగాయి. చిం దత్తనాధ క్షేత్రంలో అర్చకులు బంకుపల్లి సింహాచల శర్మ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. గోవిందనగర్ కాలనీలోని రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ధర్మకర్త మొదలవలస ఉషారాణి, జగన్మోహనరావు దంపతుల ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం 400 మందికి అన్నదానం నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో శ్రీచక్ర సిరిజ్యోతి పూజలు



బలగ నాగావళి తీరంలోని బాలత్రిపుర కాలభైరవపీఠం దేవాలయంలో వైశాఖ పౌర్ణమి సందర్భంగా శ్రీచక్రరూపేన సిరిజ్యోతి పూజలు గురువారం ఘనంగా నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో మహిళలు శ్రీచక్రంపై దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. – శ్రీకాకుళం కల్చరల్

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
శ్రీకాకుళం
9912220343
Office mail : sklmadvt@gmail.com